క్లుప్తంగా

పూర్వ విద్యార్థి వితరణ

తాడేపల్లిరూరల్ : పెనుమాక వందేమాతరం పాఠశాల పూర్వ విద్యార్థి మంగళవారం పాఠశాల ఉపాధ్యాయుల సూచనల మేరకు రెండు స్టీల్ వాటర్ క్యాన్లు అందజేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుభాని మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల భవనం నుంచి కిందకు వచ్చి మంచినీళ్లు తాగాలంటే ఇబ్బంది పడుతున్నారని, 1994లో 10వ తరగతి చదివిన మేకా అంజిరెడ్డిని వాటర్ క్యాన్లు అడగ్గా రూ.5 వేల విలువ చేసే రెండు వాటర్ క్యాన్లు అందజేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూర్ణచంద్రరావు, కో-ఆప్షన్ సభ్యులు మేకా దామేశ్వరరెడ్డి, బొక్క ప్రసన్న కుమార్, గ్రామ పెద్దలు మేకా శివారెడ్డి, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో విద్యుత్ దీపాలు లేవని సచివాలయంలో స్థానికులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం సచివాలయ సిబ్బంది స్పందించారు. మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం నుంచి వీధి లైట్లు తీసుకు వచ్చి కొత్తగా రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఇస్కాన్ టెంపుల్ వద్ద, జాతీయ రహదారి నుంచి కొలనుకొండ గ్రామంలోకి వెళ్లే ప్రాంతంలో ఈ వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి తెలిపారు. మరో నాలుగు రోజుల్లో మరమ్మతులకు గురైన వాటిని గుర్తించి కొత్త లైట్లు వేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

వాటర్ ఫిల్టర్ బెడ్ పరిశీలన



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి నులకపేట వాటర్ ఫిల్టర్ బెడ్‌లకు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను కార్పొరేషన్ ఏఈ ప్రవీణ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నులకపేట బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, బ్రహ్మానందపురం, రామయ్య కాలనీ, ఎర్రక్వారీ ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే ఫిల్టర్ బెడ్‌లు రెండు ఉన్నాయని, గతంలో ఒక ఫిల్టర్ బెడ్‌ను క్లీనింగ్ చేశామని, రెండో ఫిల్టర్ బెడ్‌లో పాత ఇసుకను తొలగించి కొత్త ఇసుకను వేస్తున్నామని, గురువారం సాయంత్రానికి ఈ పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని వెల్లడించారు.

క్రైస్తవ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో ఉన్న క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో మంగళవారం కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 రోజుల క్రితం కొలనుకొండకు చెందిన వారు తమ బరియల్ గ్రౌండ్ లోతట్టు ప్రాంతంలో ఉండడంతో క్రిమిలైజేషన్ చేయడానికి ఇబ్బందిగా ఉందని మంగళగిరి శాసన సభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి కొలనుకొండ క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో గ్రావెల్ ఫిల్లింగ్ చేయాలని సూచించారు. రూ.9 లక్షలతో బరియల్ గ్రౌండ్ గ్రావెల్ ఫిల్లింగ్ చేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ఉండవల్లి హిందూ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలోని హిందూ శ్మశాన వాటికలో మంగళవారం కార్పొరేషన్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమం చేపట్టారు. నెల రోజుల క్రితం శ్మశాన వాటికకు సర్వే నిర్వహించి ఆక్రమణలు తొలగించి రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. అనంతరం శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేసి గ్రావెల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి ప్రజలకు కృష్ణా జలాలను అందించేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంగళవారం కార్పొరేషన్ ఏఈ కిషోర్ ఆ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండవల్లి ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందించేందుకు కార్పొరేషన్ రూ.కోటి 25 లక్షల వ్యయంతో రెండు చోట్ల 9 టీఎంసీల సామర్థ్యంతో తాగునీటిని అందించేందుకు ప్రెజర్ ఫిల్టర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసిందని, వాటికి మౌలి సదుపాయాలు కల్పిస్తూ వివిధ ప్రాంతాల్లో వున్న ఓవర్‌హెడ్ ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేసేందుకు పైపులైను పనులు జరుగుతున్నాయని, మరో 10-15 రోజుల్లో ఉండవల్లికి కృష్ణాజలాలు అందించనున్నామని వివరించారు.

జగనన్న వల్లే సామాజిక న్యాయం



వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి

- ప్రతి కులానికీ రాజ్యాధికారం అప్పగించిన ఘనత ఆయనదే
- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

తాడికొండ: సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతోందని, ప్రతి కులానికీ రాజ్యాధికారం అందించిన ఘనత ఆయనదేనని రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ గుంటూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల రీజినల్ కో-ఆర్డినేటర్లు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి మర్రి రాజశేఖర్ చెప్పారు. మంగళవారం తాడికొండ అడ్డరోడ్డులోని జీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన పార్టీ తాడికొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. బలహీన వర్గాలకు ప్రాధాన్యమిస్తూ దేశానికే ఆదర్శంగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. పార్టీ పటిష్టతకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. జన సంక్షేమంలో దేశంలోనే ఏపీ ముందుందని, పిల్లల చదువు కోసం, జన ఆరోగ్యం కోసం పెట్టే ఖర్చు వృథా కాదని, వారి భవిష్యత్తుకు పెట్టుబడి అవుతుందని నమ్మిన జగనన్న విద్యా, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చారని గుర్తుచేశారు. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళాలన్నారు. కరోనా వైరస్ మహమ్మారి వల్ల వచ్చిన సంక్షోభంలోనూ గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటికే పాలన తీసుకొచ్చి అండగా నిలిచిన జగనన్నకు ప్రజలు అంతే అండగా నిలుస్తారనడంలో సందేహం లేదన్నారు. 2024 ఎన్నికల్లో 175కి 175 సీట్లు సాధించే లక్ష్యంతో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై, వైఎస్సార్ సీపీపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేసే ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో తాడికొండ నియోజకవర్గం నుంచే మొదటి విజయం ప్రారంభం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్ని గ్రామాల కార్యకర్తలు నాయకులతో ఓపికగా మాట్లాడిన రీజినల్ కో-ఆర్డినేటర్‌లు తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఎంవీఐ విజయసారథి



రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీలో ఎంవీఐ విజయసారథి

మంగళగిరి: రోడ్డు భద్రతా నిబంధనలను అందరూ పాటించాలని ఎంవీఐ విజయసారథి చెప్పారు. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నవులూరు రవాణా శాఖ కార్యాలయం వద్ద నుంచి గోలివారితోట గాంధీ బొమ్మ సెంటర్ వరకూ ఆటో డ్రైవర్లతో ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ విజయసారథి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ఆటోల ధృవీకరణ పత్రాలు ఎల్లవేళలా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించాలని, ప్రమాదాలను నివారించాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు రవాణా శాఖ తన వంతు కృషి చేస్తోందని చెప్పారు. వాహనదారులు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్‌కే శ్రీను, రవాణాశాఖ సిబ్బంది సామిరెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా

అడిషనల్ కమిషనర్ హేమమాలిని



మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశం

మంగళగిరి/తాడేపల్లి రూరల్/ఫిరంగిపురం: ఎలాంటి తప్పులూ లేకుండా ఓటర్ల జాబితా పకడ్బందీగా ఉండేలా చూసుకోవాలని అడిషనల్ కమిషనర్ కె.హేమమాలిని సూచించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఆమె బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. బుధవారం నిర్వహించ తలపెట్టిన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో డీసీపీ కె.మహాలక్ష్మి దొరతో పాటు పలువురు బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

- వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం బూత్ లెవల్ సిబ్బందికి సదస్సు నిర్వహించారు. మంగళగిరి తహసీల్దార్, తాడేపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లి డీటీ రమణరాజు, ఆర్‌ఐ ప్రశాంతి, సర్వేయర్ శ్రీరంగ మోహన్, రీ సర్వేయర్, డీటీ సతీష్ పాల్గొన్నారు.
- ఫిరంగిపురం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ పద్మనాభుడు మంగళవారం తెలిపారు. సమావేశంలో ఎన్నికల సంఘం విశిష్టత గురించి వివరించి ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తామని వెల్లడించారు.

సీతానగరంలో పూజ్య ధర్మాచార్య సదస్సు



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణపరిధిలోని సీతానగరం జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పూజ్య ధర్మాచార్య సదస్సును నిర్వహించారు. అహోబిల జీయర్‌స్వామి విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధార్మిక వ్యవస్థ, హిందూ ధర్మ పరిరక్షణ కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి స్వామీజీలు, మాతాజీలు, ఫౌండర్ నిర్వాహకులతో చర్చించారు. కార్యక్రమంలో జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మంగళవారం రాత్రి చికిత్సపొందుతూ మృతి చెందాడు. పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు గ్రామానికి చెందిన వంగేపల్లి నాగేశ్వరరావు, తన భార్య మంగమ్మతో ద్విచక్రవాహనంపై గుంటూరులోని బంధువుల ఇంటికి మంగళవారం వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో పాలడుగు అడ్డరోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వంగేపల్లి నాగేశ్వరరావు(57)కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసునమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గోమాతకు సీమంతం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సురక్ష ఆయుర్వేద వైద్యాలయంలో విజయవాడ విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం గోమాతకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వ ఆయుర్వేద పరిషత్ విజయవాడ అధ్యక్షులు డాక్టర్ పూర్ణ రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లు ధరణి కుమార్, డాక్టర్ మాణిక్యేశ్వర రావు, డాక్టర్ హృషీకేశ్, డాక్టర్ హరిచందన, తాడేపల్లిలోని మహిళలు పాల్గొన్నారు.

వైద్యులు దేవుళ్లతో సమానం

ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : వైద్యులు దేవుళ్లతో సమానమని, రోగులకు వైద్యులు మంచి సేవలు అందించాలని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి చెప్పారు. మంగళవారం దుగ్గిరాల మండలం ఈమని ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు, ఇతర సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించారని, గతంలో ఎంతో మంది వైద్యం అందక తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని, ఇప్పుడు అలాంటి ఘటనలు జరగకుండా ఉండేందుకు ఫ్యామిలీ డాక్టర్‌ను నియమించి ఇంటివద్దకే వైద్యాన్ని అందిస్తున్నారని, సిబ్బంది ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఇన్నారావు, సర్పంచ్ ఉజ్వల శ్రీవాణి, ఆసుపత్రి కమిటీ మెంబర్లు మారుతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం భక్తులకు రిజర్వేషన్‌తో పాటు దర్శనం టికెట్

ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్

తెనాలిఅర్బన్: శ్రీశైలం వెళ్లే భక్తులకు ప్రయాణ రిజర్వేషన్‌తోపాటు దర్శనం టికెట్లను ఏపీఎస్ ఆర్టీసీ అందుబాటులోకి తెచ్చిందని తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ టికెట్‌తోపాటు స్పర్శ దర్శనానికి రూ.500, అతి శీఘ్ర దర్శనానికి రూ.300, శీఘ్ర దర్శనానికి రూ.150 అదనంగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రేపటిలోగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించండి

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను బుధవారం నుంచి పూర్తిగా నిషేధిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు ఒక ప్రకటలో తెలిపారు. తెనాలి పట్టణంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను బుధవారంలోపు ఎవరికి వారు తొలగించాలని ఆయన సూచించారు. అధికారుల ఆదేశాలు పాటించకుండా అలానే ఉంచితే మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించటంతోపాటు ఏర్పాటు చేసిన వారికి అపరాధరుసుం విధిస్తారని హెచ్చరించారు. గురువారం నుంచి అందరూ తప్పని సరిగా క్లాత్ బ్యానర్‌లు, జ్యూట్, క్లాత్ క్యారీ బ్యాగులను మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

29న శ్రీనివాస కల్యాణం బుర్రకథ

తెనాలి: పట్టణానికి చెందిన భారతీయ సాహితీ, సాంస్కృతిక వేదిక శ్రీకళారంజని ఆధ్వర్యంలో ఈనెల 29న సాంస్కృతిక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 గంటలకు కవిరాజ పార్కులులోని వీజీకే భవన్‌లో 'శ్రీనివాస కల్యాణం' బుర్రకథ ఉంటుందని తెలిపారు. కథకురాలు 'నాట్యమయూరి' వి.భానుమతి భాగవతారిణి, రాజకీయం బి.అమృతవల్లి, హాస్యం ఎం.లక్ష్మీజ్యోతి వంతలుగా వివరించారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



కుంచపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలికల మానవహారం



తాడేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, బాలికలు



మంగళగిరిలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టణ సీఐ అంకమ్మరావు, ఎస్ఐ నారాయణ తదితరులు

వైభవంగా జాతీయ బాలికా దినోత్సవం

తాడేపల్లిరూరల్/మంగళగిరి/ఫిరంగిపురం : విద్యార్థి దశ నుంచే బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఐసీడీఎస్ పెనుమాక సెక్టార్ సూపర్‌వైజర్ రత్నకుమారి సూచించారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలలో బాలికలు మానవహారంగా ఏర్పడ్డారు. ఆడపిల్లలను చదివిద్దాం, ఆడపిల్లలను ఎదగనిద్దాం అంటూ నినాదాలు చేశారు. రత్నకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ, మగ పిల్లలను సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రంగారావు, అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, ఉదయ లక్ష్మి, వెంకట రమణ, దయామని, కనకమ్మ, రోజా రమణి, ప్రమీల, డ్వాక్రా యానిమేటర్ నల్లపూస పార్వతి, పాఠశాల ఉపాధ్యాయులు బొక్క నాగేశ్వరరావు, ఆశ తదితరులు పాల్గొన్నారు.


- తాడేపల్లి పట్టణ పరిధిలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వేణుకుమారి ఆధ్వర్యంలో బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు పాల్గొన్నారు.
- దుగ్గిరాల గ్రామంలోని బాలికల హైస్కూల్‌లో పోషకాహారం, బాలల హక్కుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు, మహిళలపై జరిగే హింసను నిరోధించడం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.భవాని, బి.జ్యోతి, దుగ్గిరాల జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.భారతి, అంగన్‌వాడీ టీచర్లు, పి.కన్నమ్మ, విజయలక్ష్మి, లక్ష్మి, కమలామేరి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.
- బాలికలు చిన్ననాటి నుంచే తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని మంగళగిరి పట్టణ సీఐ బి.అంకమ్మరావు సూచించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బాలికల హక్కులు పరిరక్షణ కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఆయన ఎస్ఐ నారాయణతో కలిసి ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ బాలికల హక్కుల గురించి వివరించారు. గుడ్‌షెపర్డ్ సిస్టర్స్ హ్యూమన్ రైట్స్ ఇన్‌చార్జి సిస్టర్ లత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ పి.శిరోమణి, సిస్టర్ ఊర్మిళ, హ్యూమన్ రైట్స్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె అనూష, మండల కో-ఆర్డినేటర్ నేలటూరి నాగమణి, కార్తీక్, బుల్లా విజయ రాఘవ, నాగలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం నగరంలోని రత్నాల చెరువు బీఎస్‌ఆర్ పాఠశాల, 11,12 సచివాలయాలతోపాటు నగర పరిధిలోని ఆత్మకూరు సచివాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు.
- బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషిచేస్తున్నట్లు ఫిరంగిపురం తహసీల్దార్ పద్మనాభుడు చెప్పారు. ఐసీడీఎస్ కార్యాలయం వద్ద మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, నిర్మల, ఆనందకుమారి, సెయింట్‌ఆన్స్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లిరూరల్ : పెనుమాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మంగళవారం మత్తుపదార్థాలు-దుష్పరిణామాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ మాట్లాడుతూ తాత్కాలిక సంతోషం కోసం విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిత విద్యార్థులపైనే ఆధారపడి ఉందని, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాల వల్ల వచ్చే వ్యాధుల గురించి ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్స్ బి.రమేష్, పెనుమాక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పూర్ణచంద్రశేఖర్‌రావు, విద్యా కమిటీ చైర్మన్ ఎస్‌కే సుభాని, పెనుమాక సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.రత్నకుమారి పాల్గొన్నారు.

భూసర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



మేడికొండూరు: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష సర్వేను గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి చెప్పారు. మంగళవారం వెలవర్తిపాడు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పని విధానం, రిజిస్టర్ల నిర్వహణపై ఆరా తీశారు. స్పందన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంకితభావంతో పనిచేయాలని సూచించారు. భూ రీసర్వేలో ఎదురవుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.కరుణకుమార్, డీఎస్ఎల్ఓ నాయక్, పలువురు వీఆర్ఓలు, సర్వేయర్‌లు పాల్గొన్నారు.

రేపు చిన్నారులకు అక్షరాభ్యాసం

మంగళగిరి: వసంత పంచమి సందర్భంగా ఈనెల 26వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నూతక్కి విజ్ఞాన విహార ఇంగ్లిషు మీడియం ఉన్నత పాఠశాల ఆవరణలోని విజయ గణపతి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ వెనిగళ్ల సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., One Town Branch, VJA వారి ... తెలియజేయునది ఏమనగా...

[illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432



